సోంపేట రైల్వేస్టేషన్‌లో సమస్యల కూత!

- కానరాని మౌలిక సదుపాయాలు
- ప్రయాణికుల అవస్థలు
- నేడు ఈస్ట్‌కోస్ట్ రైల్వే జీఎం రాక



సోంపేట రైల్వేస్టేషన్


రెండో నంబర్ ప్లాట్‌ఫాంపై ఎండలో వేచి ఉన్న ప్రయాణికులు

కంచిలి: ఉద్దానంతోపాటు ఆంధ్ర–ఒడిశా సరిహద్దు ప్రజలకు ప్రయాణ అవసరాలు తీరుస్తున్న సోంపేట రైల్వేస్టేషన్‌లో సమస్యలు తిష్టవేశాయి. ఇక్కడ నుంచి ప్రయాణించేవారు అధికసంఖ్యలో ఉండడంతో రైల్వేశాఖకు ఆదాయం కూడా అధికంగానే చేకూరుతోంది. అయితే వివిధ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టు కల్పించడం, సౌకర్యాల కల్పన విషయంలో ఈ స్టేషన్ వెనుకబడి ఉంది. ఈస్ట్‌కోస్ట్ రైల్వే పరిధిలో ఉండే ఈ స్టేషన్ నుంచి సోంపేట, కంచిలి, కవిటి మండలాలతోపాటు సమీపంలో ఉన్న ఒడిశా సరిహద్దు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఇక్కడ నుంచి ఏటా 54,710 మంది ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు వెళుతున్నారు. వీరి నుంచి ఏడాదికి మూడు కోట్ల రెండు లక్షల 66 వేల 717 రూపాయల ఆదాయం సమకూరుతోంది. ఇంతగా ఆదాయం సమకూరుతున్నప్పటికీ తగినన్ని సౌకర్యాల కల్పన రైల్వేశాఖ చేపట్టడం లేదు.

చేపట్టాల్సిన పనులు

ఈ స్టేషన్‌కు వచ్చే వృద్ధులు, మహిళలు, చిన్నపిల్లలు రెండు, మూడు, నాలుగు ప్లాట్‌ఫాంలకు ఫుట్ బ్రిడ్జి మీదుగా లగేజీలను తీసుకెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు. వీరి కోసం ర్యాంప్ బ్రిడ్జి ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇక్కడి ప్లాట్‌ఫాంల మీద అవసరమైనన్ని ప్రయాణికులు వేచి ఉండే షెడ్లు లేకపోవడంతో రైలు వచ్చే వరకు ఎండలోనే వేచి ఉండాల్సి వస్తోంది. ఎక్కువగా రైళ్లు ఆగే 2, 3 ప్లాట్‌ఫాంలలో సరిపడా షెడ్స్ ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. అలాగే ఈ ప్రాంతం నుంచి ఎక్కువగా ప్రయాణికులకు ఉపయోగపడే పూరి–అహ్మదాబాద్ రైలుకు సోంపేట స్టేషన్‌లో హాల్టు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. కాగా ఈ స్టేషన్‌ను ఈస్ట్‌కోస్ట్ రైల్వే జీఎం సోమవారం సందర్శించనున్నారు. ఈ నేపథ్యంలో ఇక్కడ కల్పించాల్సిన మౌలిక సదుపాయాలపై ఆయన దృష్టిసారించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

విశ్రాంతి షెడ్లు లేక అవస్థలు



సోంపేట రైల్వేస్టేషన్ నుంచి ఏడాదికి మూడు కోట్ల రూపాయలకు పైగా ఆదాయం సమకూరుతోంది. దీనికి తగ్గట్టుగా సౌకర్యాల కల్పన చేపట్టాల్సి ఉంది. ముఖ్యంగా రైలు వచ్చే వరకు ఎండలోనే ప్లాట్ ఫాంల మీద వేచి ఉంటున్న ప్రయాణికుల కోసం అవసరమైనన్ని షెడ్లను ఏర్పాటు చేయాలి.

–ఎస్.ఎస్.నారాయణ, రిటైర్డు టీటీఈ, కంచిలి

సౌకర్యాలు మెరుగుపర్చాలి



రైల్వేస్టేషన్లలో సౌకర్యాల మెరుగుపర్చాలి. సోంపేట స్టేషన్‌లో అదనపు రైళ్ల హాల్టులు, ర్యాంప్ బ్రిడ్జి, షెడ్స్ ఏర్పాటు చేయాలి. ఆదాయం వస్తున్నందున ప్రయాణికులకు అవసరమైన సౌకర్యాలను మెరుగుపర్చాలి.

–శ్రీనివాసరావు రౌళో, జెడ్‌ఆర్‌యూసీసీ సభ్యుడు సభ్యుడు

కొండపై నుంచి దూకేస్తా..

- ఇంద్రకీలాద్రిపై పలాస యువకుడు హల్‌చల్
- పోలీసులు, దుర్గగుడి సిబ్బందికి ముచ్చెమటలు


పోలీసులు అదుపులో ఉన్న బాలరాజు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై నుంచి దూకేస్తానంటూ పలాసకు చెందిన ఓ యువకుడు ఆదివారం హల్‌చల్ చేశాడు. దుర్గగుడి ప్రాంగణంలోని మల్లేశ్వరాలయం వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. పలాసకు చెందిన పాట్నూరి బాలరాజు(32) జీడిపప్పు వ్యాపారంతో పాటు సూపర్ మార్కెట్ నడుపుతుంటాడు. కొంత కాలంగా వ్యాపారంలో నష్టం రావడంతో సుమారు రూ.3 కోట్ల మేర అప్పులు చేశాడు. ఈ నెల చివరి వారంలో బాలరాజు వివాహం నిశ్చయమైంది. ఆర్థిక ఇబ్బందులతో మానసికంగా కుంగిపోయాడు. ఇంతలో బాలరాజు తల్లిదండ్రులు ప్రయాగరాజ్‌లో జరుగుతున్న కుంభమేళాకు వెళ్లారు. చెల్లెలు వైజాగ్‌లో ఉండటంతో బాలరాజు కొద్ది రోజుల కిందట విజయవాడకు వచ్చాడు. ఎలాగైనా తన గోడు డిప్యూటీ సీఎంకు చెప్పుకుందామని భావించాడు. నేరుగా వెళ్లి కలిసేందుకు అవకాశం లేకపోవడంతో తాను చనిపోవాలని నిర్ణయించుకుని కొద్ది రోజులుగా దుర్గగుడిపై తిరుగుతున్నాడు. ఆదివారం ఉదయం తొమ్మిది గంటల సమయంలో మల్లేశ్వరాలయం ఈశాన్య మూలలో ఉన్న ఇనుప గేటుకు తీసుకుని అవతలి వైపుకు వెళ్లిన బాలరాజు ఎవరూ రాకుండా తాళం వేశాడు. ఇనుప చువ్వలను పట్టుకుని బాలరాజు తాను కిందకు దూకేస్తున్నానని కేకలు వేశాడు. దీంతో అక్కడే ఉన్న భక్తులు, ఆలయ సిబ్బంది, అర్చకులు బాలరాజును చూసి కంగారు పడ్డారు. వెంటనే ఆలయ సెక్యూరిటీ అధికారులతో పాటు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మల్లేశ్వరాలయానికి చేరుకున్న సెక్యూరిటీ సిబ్బంది, పోలీసులు సిబ్బంది ఆ యువకుడికి ఎంత నచ్చచెప్పినా ప్రయోజనం లేకపోగా, తన వద్దకు ఎవరైనా వస్తే కిందకు దూకేస్తానంటూ బెదిరించాడు. అప్పటికే ఆలయంలో పలువురు ప్రముఖులు విచ్చేయడంతో వారి బందోబస్తులో ఉన్న వన్‌టౌన్ సీఐ గురుప్రకాష్ మల్లేశ్వరాలయం వద్దకు చేరుకుని సదరు యువకుడితో మాట్లాడారు. తనతో వస్తే డిప్యూటీ సీఎం వద్దకు తీసుకెళ్తానని చెప్పారు. అయినా సరే ఆ యువకుడికి నమ్మకం కలగకపోవడంతో డిప్యూటీ సీఎం పీఏతో నేరుగా ఫోన్‌లో మాట్లాడించడంతో యువకుడు శాంతించి వెనుతిరగడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. వన్‌టౌన్ స్టేషన్‌కు బాలరాజును తరలించిన పోలీసులు అతని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసుల ద్వారా విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు హుటాహుటిన విజయవాడకు బయలుదేరినట్లు తెలుస్తుంది.

రిటైర్డు ఆర్మీ జవాన్లకు ఘన స్వాగతం


రిటైర్డు జవాన్లను సత్కరిస్తున్న గ్రామస్తులు

పలాస: కేదారిపురం గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్లు పాడి వేణుగోపాల్, పాడి త్రినాథ్‌లకు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. వేణుగోపాల్ 24 ఏళ్లు, త్రినాథ్ 30 ఏళ్లు భారత సైన్యంలో పనిచేశారు. దేశానికి సేవలందించి ఉద్యోగ విరమణ పొందిన వారిద్దరూ తమ స్వగ్రామానికి ఆదివారం వచ్చిన సందర్భంగా పలాస రైల్వే స్టేషన్ వద్దకు గ్రామస్తులు చేరుకొని ఘనంగా స్వాగతం పలికారు. పూలు జల్లుతు ర్యాలీగా గ్రామానికి తోడ్కొని వెళ్లారు. అనంతరం సత్కరించి గౌరవించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బోడసింగి ధనుంజయ, పాడి దుర్యోధన, పాడి కిరణ్, పాడి ఈశ్వరరావు, బి.రమేష్, కొల్లి ఈశ్వరరావు, పి.జగదీష్, పి.సూర్యారావు, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

స్వేచ్ఛానృత్య తరంగిణి విద్యార్థులకు పురస్కారాలు


పురస్కారాలతో నృత్యతరంగిణి బృందం

ఇచ్ఛాపురం: స్థానిక స్వేచ్ఛానృత్య తరంగిణి విద్యార్థులకు అరుదైన గౌరవం దక్కింది. వీరికి కళామయూఖ పురస్కారాలు వరించినట్టు స్వేచ్ఛా నృత్యతరంగిణి అధ్యక్షులు కె.గోవిందరావు తెలిపారు. శని, ఆదివారాల్లో రాజమహేంద్రవరంలో జరిగిన ఇండియన్ డ్యాన్స్ అండ్ మ్యూజిక్ ఫెస్టివల్ కార్యక్రమంలో విద్యార్థులు భరతనాట్యం, కూచిపూడి, జానపదం నాట్య ప్రదర్శనలు ఇచ్చారు. ఈ సందర్భంగా నాట్యగురువు మంగి దివ్యకు కళావిపంచి, నాట్య విద్యార్థులకు కళామయూఖ పురస్కారాలను ప్రముఖ నాట్యగురువు డాక్టర్ ఎం.నాగేశ్వరరావు చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా నాట్యకారులకు స్థానికులు అభినందనలు తెలియజేసారు.

చిత్తడి నేలలను సంరక్షిద్దాం


టెక్కలి: విజేతలకు బహుమతులు అందజేస్తున్న అటవీ సిబ్బంది


ఇచ్ఛాపురం రూరల్: చెరువుపరిసరాలను శుభ్రం చేస్తున్న అటవీశాఖ సిబ్బంది

టెక్కలి: భవిష్యత్‌లో జీవ వైవిధ్యం మనుగడ కొనసాగాలంటే చిత్తడి నేలల పరిరక్షణ ఎంతో అవసరమని అటవీ శాఖ అధికారి జి.జగదీశ్వరరావు సూచించారు. వరల్డ్ వెట్ ల్యాండ్ డే సందర్భంగా ఆదివారం టెక్కలి మండలం తేలినీలాపురం పక్షుల కేంద్రంలో విద్యార్థులకు చిత్తడి నేలల సంరక్షణ, అందులో నివసించే జీవ జాతుల పరిరక్షణపై అవగాహన కల్పించారు. అలాగే వ్యాస రచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. సబ్ డీఎఫ్‌వో ఎ.వి.నాగేంద్రరావు, సిబ్బంది ఎస్.కృష్ణారావు, పి.ఝాన్సీ, ఎస్టీ బాలికల వసతి గృహం వార్డెన్ డి.సునీత, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.సింహాచలం పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం రూరల్: చిత్తడి నేలను సంరక్షించుకోవలసిన బాధ్యత ప్రజలందరిపై ఉందని ఫారెస్ట్‌రేంజ్ అధికారి ఎ.మురళీకృష్ణనాయుడు అన్నారు. తేలుకుంచిలోని వలసపక్షుల సంరక్షణ కేంద్రంలో చిత్తడి నేల దినోత్సవాన్ని నిర్వహించారు. గ్రామప్రజలతో కలిసి స్థానికంగా ఉన్న చెరువులచుట్టు పెరుకుపోయిన పిచ్చి మొక్కలను, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. మందస డిప్యూటీ రేంజ్ అధికారి రాము, తేలుకుంచి సర్పంచ్ పాతిర్ల రాజశేఖర్, ఎంపీటీసీ సభ్యుడు సూర్యనారాయణ, అటవీ సిబ్బంది భానుమూర్తి, వేంకటేష్, దుర్గాదేవి పాల్గొన్నారు.

విగ్రహాల ఆవిష్కరణ


విగ్రహాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కంచిలి: బొగాబెణి ప్రాథమికోన్నత పాఠశాల ప్రాంగణంలో ఆదివారం వసంత పంచమిని పురస్కరించుకొని సరస్వతిదేవి, భారతమాత విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఎంఈవోలు ఎస్.శివరాంప్రసాద్, కె.చిట్టిబాబుల చేతులమీదుగా నిర్వహించారు. పాఠశాల కమిటీ మాజీ అధ్యక్షుడు పొందర ధనుంజయ, పార్వతి దంపతులు సరస్వతిదేవి విగ్రహాన్ని, ప్రస్తుత పాఠశాల కమిటీ అధ్యక్షుడు పొందర లలిత, శివ దంపతులు భారతమాత విగ్రహాలకు ఆర్థికసాయం చేశారు. స్థానిక సర్పంచ్ గణప సింహాచలం, ప్రధానోపాధ్యాయుడు శరత్‌చంద్ర బెహరా, స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ సీతారాంనాయుడు, వైస్ చైర్మన్ కవిత అలెక్ బెహరా పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ ప్రాణప్రతిష్ట


జెడ్పీ చైర్‌పర్సన్ విజయను సత్కరిస్తున్న నాయకులు

కాశీబుగ్గ: మందస మండలం మదనాపురం గ్రామంలో సీతారామ మందిరం ప్రాణప్రతిష్ట కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు, దాతల సహకారంతో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ విచ్చేశారు. ఆమెను మందస ఎంపీపీ కొర్ల కన్నారావు ఆధ్వర్యంలో స్థానిక పెద్దలు, మహిళలు సత్కరించారు.

పోలారావు సేవలు మరువలేనివి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామారావు

ఇచ్ఛాపురం: మున్సిపల్ చైర్మన్‌గా ఇచ్ఛాపురం పట్టణానికి పిలక పోలారావు చేసిన సేవలు మరువలేనివని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. బెల్లుపడ గ్రామంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి అధ్యక్షతన మాజీ మున్సిపల్ చైర్మన్ పోలారావు వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. పలువురునాయకులు పోలారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు ప్రకాశరావుపట్నాయక్, ఇప్పిలి కృష్ణారావు, దుక్క లోకేశ్వరరావు, పిలక యాదవరెడ్డి, పిలక విజయ్, పరపటి కోటి, రాంజీ, పరపటి కోటిరెడ్డి, పి.ఈశ్వర్‌రెడ్డి, కె.భీష్మ, ఖగపతి పాల్గొన్నారు.

అరసవల్లి వెళ్లే వారికి సూచన

కాశీబుగ్గ: రథసప్తమి సందర్భంగా ఇచ్ఛాపురం, పలాస నుంచి అరసవల్లి సూర్యనారాయణ స్వామి దర్శనానికి వెళ్లే భక్తులకు కాశీబుగ్గ సీఐ సూర్యనారాయణ సూచన చేశారు. పెద్దపాడు గ్రామానికి ముందు ఎడమవైపున ఉన్న తారు రోడ్డుగుండా ప్రయాణిస్తే శాస్త్రులపేట, సానివాడ, ఒప్పంగి గ్రామాలు దాటి అరసవల్లి ప్రత్యేక పార్కింగ్ వద్దకు సులువుగా చేరుకోవచ్చునన్నారు.

క్లుప్తంగా

మృతిచెందిన గొర్రెలకు పోస్టుమార్టం


గొర్రెకు పోస్టుమార్టం నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

టెక్కలి రూరల్: గూడెం పంచాయతీ పరిధి పిట్టలసరియా గ్రామానికి చెందిన గండేటి అప్పలస్వామితోపాటు మరికొంత మంది రైతులకు చెందిన సుమారు 40 గొర్రెలు నందిగాం మండలం బడబంద గ్రామంలో శనివారం మృతి చెందాయి. ఈ విషయం తెలుసుకున్న టెక్కలి పశువైద్యాధికారి డాక్టర్ ఎం పూర్ణచంద్రరావు తమ సిబ్బందితో కలిసి బడబంద గ్రామంలోని ఘటన స్థలానికి చేరుకొని మృతి చెందిన గొర్రెను పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం నిర్వహించారు. గొర్రెలు మృతికి ధాన్యం అధికంగా తినడంతో జీర్ణం అవ్వకపోవడంతో మృతి చెందినట్లు పశువైద్యాధికారి పూర్ణచంద్రరావు తెలిపారు. లింగలవలస పశువైద్య సిబ్బంది జె.చిన్నమ్మి, బి.ధనలక్ష్మి, యాదవ సంఘం నాయుకులు ఇప్పిలి జగదీష్, జానకీరామ్, భీమారావు పాల్గొన్నారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

సోంపేట: మండలంలోని బేసి రామచంద్రాపురం జంక్షన్‌లో పేకాట ఆడుతున్న ఏడుగురిని ఆదివారం అరెస్టు చేసినట్లు బారువ ఎస్‌ఐ హరిబాబు నాయుడు తెలిపారు. వీరి వద్ద నుంచి 42 వేల రూపాయలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

డాక్టరేట్ ప్రదానం


డాక్టరేట్ అందుకుంటున్న రాజశేఖర్

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ శివాజీనగర్‌కు చెందిన డాక్టర్ డి.రాజశేఖర్‌కు హైదరాబాద్‌లో గౌరవ డాక్టరేట్ దక్కింది. గ్లోబల్ సోషల్ వర్కర్, సోషల్ రీఫార్మ్స్ కోసం కృషి చేసినందుకు ఆసియ వేదిక ఇంటర్నేషనల్ కల్చర్ వారు గౌరవ డాక్టరేట్‌ను ఆయనకు ఆదివారం ప్రదానం చేశారు.

తెప్పలకు సత్కారం


క్రిష్ణమూర్తిని సన్మానిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: పలాసకు చెందిన కళాకారుడు, రచయిత సమాఖ్య కార్యవర్గ సభ్యుడు లయన్ డాక్టర్ తెప్పల కృష్ణమూర్తికి అరుదైన గౌరవం దక్కింది. జిల్లా కేంద్రం శ్రీకాకుళంలోని బాపూజీ కళామందిర్‌లో ఆదివారం జరిగిన శ్రీకాకుళం రంగస్థల సమాఖ్య 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా తెప్పల చేస్తున్న సాహితీ సేవలను గుర్తించి సత్కరించారు. సమాఖ్య గౌరవ అధ్యక్షులు రామలింగస్వామి, ముఖ్యఅతిథిగా ప్రముఖ న్యాయవాది మీగడ వినయ్ భూషన్, విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ నిక్కు అప్పన్న, లయన్ నాటుకుల మోహన్, ప్రధాన కార్యదర్శి రామచందర్‌దేవ్‌లు కృష్ణమూర్తిని అభినందించారు.

వార్డెన్లు అందుబాటులో ఉండాలి


వార్డెన్, విద్యార్థినులతో సమావేశమైన విజయలక్ష్మి

సాక్షి ఎఫెక్ట్...

టెక్కలి: బాలికల వసతి గృహాల్లో వార్డెన్లు అందుబాటులో ఉంటూ వారి భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఏఎస్‌డబ్ల్యూఓ విజయలక్ష్మి స్పష్టం చేశారు. ఆదివారం సాక్షిలో 'బాలికల వసతి గృహాల్లో కానరాని భద్రత' శీర్షికతో వచ్చిన కథనానికి ఆమె స్పందించారు. దీంతో టెక్కలి సాంఘిక సంక్షేమ శాఖ కళాశాల బాలికల వసతి గృహాన్ని విజయలక్ష్మి సందర్శించి అక్కడ పరిస్థితులను తెలుసుకున్నారు. వార్డెన్ సరోజినితో పాటు విద్యార్థినులతో సమావేశం నిర్వహించారు. వసతి గృహంలో విద్యార్థినులకు అందుబాటులో వార్డెన్లు ఉండడంతోపాటు పిల్లల భద్రత, మౌలిక సదుపాయాల విషయంలో ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ

పలాస: నీలావతి గ్రామంలోని ఉద్దానం ప్రాంత విద్యాభివృద్ధి వేదిక (యూవీవీ) గ్రంథాలయానికి.. గౌరవ సలహాదారుడు, మనోవికాస నిపుణుడు రాంబుడ్డి గణపతి 50 రకాల పుస్తకాలను వితరణగా ఆదివారం అందజేశారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యూవీవీ గౌరవ అధ్యక్షులు కుత్తుం ప్రకాశరావు, కోశాధికారి జినగ సీతారామయ్య, కె.సుధాకర్, కుత్తుం వినోద్ పాల్గొన్నారు.

పసుపు కొనుగోలు ఉత్సవం



కంచిలి ప్రాంత ప్రజల ఆరాధ్య దైవం.. కంచమ్మతల్లి గ్రామదేవత ఉత్సవాల నిర్వహణ కోసం పసుపు కొనుగోలు ఉత్సవం ఆదివారం కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. కంచిలి మెయిన్‌రోడ్డులోని అమ్మవారి పీఠస్థానం నుంచి భక్తులు ఊరేగింపుగా వచ్చి పసుపు కొనుగోలు చేశారు. భక్తుల నుంచి సేకరించిన పసుపు కొమ్ములను అనంతరం అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఇక్కడి నుంచి సంబరాల ఏర్పాటు పనుల్ని ప్రారంభించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

–కంచిలి

ఆర్థికసాయం..



పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ 12వవార్డు హరిజన వీధికి చెందిన దయాకర్ ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న స్థానిక అంబేడ్కర్ సింహ గర్జన యూత్ ఆధ్వర్యంలో మాదిక కుల సంఘం అధ్వర్యంలో రూ.25,549 సేకరించారు. ఈ మొత్తాన్ని దయాకర్ తల్లి శ్రీదేవికి ఆదివారం అందజేసి అండగా నిలిచారు. సింహ గర్జన యూత్, మాదిగ కుల పెద్దలు పాల్గొన్నారు.

–కాశీబుగ్గ

ఆలయ ప్రతిష్ట..



నందిగాం మండలంలోని క్రిష్ణరాయపురం గ్రామంలో నివేపపోలమ్మతల్లి అమ్మవారి అలయ ప్రతిష్ట కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. టెక్కలి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పేరాడ తిలక్, ఎంపీపీ నడుపూరి శ్రీరాంమూర్తి, యువజన అధ్యక్షులు చిన్ని జోగరావు, సర్పంచ్ కవిటి యర్రన్న, ఎంపీటీసీ సభ్యులు అంబోడి విష్ణు, బి.గున్నయ్య, మోహన్‌రావు పాల్గొని పూజలు చేశారు.

–నందిగాం

కబడ్డీ విజేత గొల్లమాకన్నపల్లి



పలాస మండలం గొల్లమాకన్నపల్లిలో అభయ ఆంజనేయ ఐదో వార్షికోత్సవం సందర్భంగా కాశీబుగ్గ బిగ్ సీ సెల్ ఫోను షాపు, గ్రామ సంఘం, గ్రామ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి ఆహ్వానిత కబడ్డీ పోటీల్లో గొల్లమాకన్నపల్లి గ్రామ జట్టుకు నిలిచింది. 13 జట్లు తలపడగా.. రెండో స్థానంలో శ్రీకాకుళం, మూడో స్థానంలో మామిడిపల్లి, బాహాడపల్లి జట్లు నిలిచాయి. విజేత జట్లకు రూ.12 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు అందజేశారు. అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టరు కుత్తుం లక్ష్మణకుమార్, వైఎస్సార్‌సీపీ యువజన నాయకుడు ఎం.ఎస్ మూర్తి, మాకన్నపల్లి సర్పంచ్ సైని దేశయ్య పాల్గొన్నారు.

– పలాస

సంక్షిప్తంగా...

నాయకుల పరామర్శ


సోంపేట: పరామర్శలో విజయ తదితరులు

సోంపేట: తాళభద్ర పంచాయతీలో పలువురు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల కుటుంబాలను జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ ఆదివారం పరామర్శించారు. తాళభద్ర ఉగ్రపల్లి చిన్నయ్య, రాణిగాం గ్రామానికి చెందిన కె.తుంబనాదం ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలియజేశారు. ఎంపీపీ నిమ్మన దాస్, పార్టీ నాయకులు కృష్ణారావు, గిరీష్ రావు, పాపారావు, కూర్మారావు ఉన్నారు.

టెక్కలి: టెక్కలి మండల ఏపీవో బగాది హరిప్రసాద్ తండ్రి హరిప్రసాద్ ఇటీవల మృతి చెందారు. దీంతో హరిప్రసాద్ కుటుంబ సభ్యులను వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ ఆదివారం పరామర్శించారు. నందిగాం ఎంపీపీ ఎన్.శ్రీరామ్మూర్తి, నాయకులు మోదుగువలస గణపతి రావు, ఆట్ల రాహుల్ ఉన్నారు.

హెచ్‌సీకి సత్కారం

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పని చేస్తున్న తెలుకుల రామారావు చేస్తున్న సమాజ సేవలకు గుర్తింపుగా గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్ చేతులు మీదుగా ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకున్నారు. దీంతో ఆయన్ని శ్రీసురంగి రాజాక్రీడా మైదానం ఆవరణలో అలయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం సత్కరించి గౌరవించారు. అలయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు ఉమాశంకర్, సత్యమయ్య, బుజ్జి, కె.నరసింహమూర్తి, దక్కత గోపీనాథ్, కె.మోహన్ రావు, వెంకటరమణ, దక్కత సుమన్, పాపారావు, కె.పద్మనాభంరెడ్డి, బత్తుల రామారావు, ఆశి రవి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

శిష్టు గోపికి సన్మానం


గోపిని సత్కరిస్తున్న నాయకులు

కాశీబుగ్గ: వైఎస్సార్‌సీపీ పలాస–కాశీబుగ్గ పట్టణ అధ్యక్షుడిగా శిష్టు గోపి నియమితులయ్యారు. దీంతో ఆయన్ని 20వవార్డు పార్టీ నాయకులు అంబటి ఆనందరావు ఆధ్వర్యంలో లేబరు కాలనీలో ఆదివారం సన్మానం చేశారు. నాయకులు బడగల బల్లయ్యానాయుడు, అంబటి ఆనందరావు, గజ్జి బాలయ్య, బమ్మిడి సుధాకర్, పల్లెటి గణపతి, పినకాన ముకుందరావు, బగాది సింహాచలం, కొనారి ఆది, అర్జాల ఆదినారాయణ కోనేరు కాళీదాసు, లండ రమణ, పల్లెటి కామేష్, ధర్మాపు మురళి, కోవిరి దేవరాజు, పెరిమల్లి ప్రకాష్ పాల్గొన్నారు.

యువకుడుకి గాయాలు

కాశీబుగ్గ: పలాస మండలం టెక్కలిపట్నం పంచాయతీ రేగులపాడు గ్రామం వద్ద ఆదివారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. రేగులపాడుకు చెందిన ఐతి శంకరరావు (40) ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తుండగా పాడైన రోడ్డులో ఒరిగిపడిపోయాడు. శంకర్‌కు తీవ్రంగా గాయాలవడంతో స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించారు. సిబ్బంది సత్యం, రాజేష్‌లు ఘటనాస్థలానికి చేరుకుని క్షతగాత్రుడుకి ప్రథమ చికిత్స అందించి.. పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు.

నేడు పీజీఆర్‌ఎస్ రద్దు

టెక్కలి: టెక్కలి రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో సోమవారం జరగనున్న పీజీఆర్‌ఎస్ ఫిర్యాదుల స్వీకరణ విభాగాన్ని రద్దు చేస్తున్నట్లు ఆర్డీఓ ఎం.కృష్ణమూర్తి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో పీజీఆర్‌ఎస్‌ను రద్దు చేశామని.. దీన్ని ప్రజలు గమనించాలన్నారు.

అరకు ఉత్సవాల్లో సిక్కోలు జముకల పాట


జానపద కళాకారులతో కూర్మారావు

పలాస: అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులో మూడు రోజులు జరిగిన చలి ఉత్సవాల్లో ఉత్తరాంధ్ర జానపద కళలైన జముకుల పాట, చెక్కభజనలు ప్రదర్శనకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఇందులో భాగంగానే గిడుగు రామ్మూర్తి తెలుగు భాషా జాన పద కళాపీఠం అధ్యక్షులు బద్రి కూర్మారావు తన ఆటా పాటలతో అక్కడ అలరించారు. రంగోయి గ్రామానికి చెందిన కూర్మారావు ఈ సందర్భంగా మాట్లాతూ.. అరకు చలి ఉత్సవాల్లో వివిధ రాష్ట్రాల ఆది వాసీ తెగల జానపద నృత్యాలతో పాటు అంతరించిపోతన్న ఉత్తరాంధ్ర జానపద కళలకుఅవకాశం రావడం సంతోషకరమన్నారు.

డివైడర్‌పైకి దూసుకుపోయిన కారు

ఇచ్ఛాపురం: జాతీయరహదారి–16పై పెను ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం సాయంత్రం పలాస నుంచి ఒడిశా వైపు జాతీయ రహదారిపై వస్తున్న కారు బెల్లుపడ కూడలిని సమీపిస్తుండగా అటుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి డివైడర్ మీదకు దూసుకుపోయింది. ఈ ఘటనలో కారు ముందుభాగం పూర్తిగా ధ్వంసం కాగా అందులో ప్రయాణిస్తున్న నలుగురు స్వల్పగాయాలతో బయటపడడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.